# జీవితం కథ కథ

ఇదీ ఒక ప్రేమ కథే! చాలామంది ప్రేమికుల్లాగే వీళ్ళూ ప్రేమించుకున్నారు.

సినిమాల్లో, నవలల్లో లాగే అమ్మాయి గొప్పింటిది, అబ్బాయి మధ్యతరగతికి చెందినవాడు. వీళ్ళ ప్రేమ కథా సినిమాల్లోలాగే ప్రారంభమయింది. ముందుగా అబ్బాయి అమ్మాయిని చూసి ప్రేమించాడు. "పెళ్ళి చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను. లేదూ అంటే బ్రహ్మచారిగానైనా వుండిపోతాను గానీ మరెవ్వర్నీ చేసుకో"నని శపథం చేసాడు. తరవాత మెల్లిగా వల పన్నాడు. మొత్తానికి సాధించి ఆ అమ్మాయిని బుట్టలో పడేలా చేసాడు. ఆ తరవాత ఆ అమ్మాయి, అబ్బాయిల తల్లితండ్రులకీ విషయం తెలిసి బాగా చీవాట్లేసారు.

"ఒరేయ్ ఆ పిల్ల లక్షాధికారి కూతురురా! నువ్వు ఈ ఇంటికి పెద్ద పిల్లాడివి. నీ పెళ్ళి కొచ్చిన దాంతో ఆడపిల్లల్ని పంపాలని చూస్తున్నాం. ఆ పిల్ల కట్నకానుకలతో వస్తుందో లేక నిన్ను తీసుకెళ్ళి వాళ్ళ కార్లూ, వాకిళ్ళూ తుడిపిస్తుందో? బాగా ఆలోచించుకో" అంటూ హెచ్చరించాడు అబ్బాయి తండ్రి.

"అమ్మాయీ! ఆ దరిద్రగొట్టింటి కోడలివైతే తిండికి ముఖం వాచి ఏడుస్తావు. వాడు ప్రేమిస్తున్నది నిన్ను కాదు. నీ డబ్బునని తెలుసుకో" అంటూ హెచ్చరించాడు అమ్మాయి తండ్రి.

ప్రేమ మైకంలో మునిగిన సుమన్, సరితలకీ హెచ్చరికలు తాటాకుల చప్పుళ్ళే అయ్యాయి. ఏదో టైములో యిద్దరూ రోజూ కాలేజీలో కలుసుకునేవారు. ఉత్తరాలు అందిచ్చుకునేవారు. సరితని యింట్లోవాళ్లు సినిమాలకీ, షికార్లకీ వెళ్ళకుండా ఆటంకపరిచిన రోజు విరహవేదనతో తపించిపోయేవారు. సుమన్‌లోని ఉడుకురక్తం సరిత కోసం ఆవేదనతో తపింపజేసి నిద్రపోనిచ్చేది కాదు. రాత్రింపగళ్ళూ సుమన్ ఆలోచనలు 'తమ ప్రేమ కథ ఎలా ముగుస్తుందా?' అన్నదే.

సరిత తల్లితండ్రులు వాళ్ళని కలవనివ్వకుండా చెయ్యగలిగిన బందోబస్తులు చేసారు. అయినా ప్రయోజనం శూన్యం. ఆఖరికి సరిత తండ్రి సరితని కాలేజీ మాన్పించి ఇంట్లోంచి కదలనివ్వకుండా చెయ్యడమే కాకుండా, ఆమెకి పెళ్ళి సంబంధాలు చూడసాగాడు. అది తెలిసిన సుమన్ ఆరాటం, ఆందోళన మరీ అధికమయ్యాయి. అమ్మాయి అన్నం మానేసి కిటికీ దగ్గరే కూర్చునేది. అబ్బాయి గెడ్డం పెంచుకుని సరిత ఇంటి ముందు పచార్లు చేసేవాడు. అచ్చం

సినిమాల్లోలాగే అబ్బాయి కనపడగానే అమ్మాయి కళ్ళ నీళ్ళెట్టుకుంటుంటే, రోడ్డుమీద దేవదాసులా నిలబడి అబ్బాయి విరహగీతం ఆలాపించేవాడు.

రాను రాను ఈ బాధ తట్టుకోలేనిదీ, భరించలేనిదీ అయింది. గిలగిల్లాడి పోతున్నాడు సుమన్. కలిసి కిలకిలా నవ్వే ప్రేమికులు, రాసుకు పూసుకు తిరిగే ప్రేమికులు ఈరోజు ఒకరి నొకరు చూసుకుని తృప్తిపడమంటే సాధ్యమా! "ఈ నిర్బంధపు జీవితం ఎన్నాళ్ళూ? దీనికి పరిష్కారమేమిటి?" అన్న ఆలోచనలు అతని మెదడుని తొలచసాగాయి. "ఆరు నూరైనా, నూరు ఆరైనా నిన్నే పెళ్ళి చేసుకుంటాను. లేదా బాబీ సినిమాలోలా ప్రాణాల్ని అర్పించేద్దాం" అంటూ ఉత్తరంరాసి రాయికి కట్టి విసిరాడు సుమన్.

ఆ తరవాత ఒక నిర్ణయానికొచ్చి మరో ప్రేమలేఖ రాసి, సరిత పనిమనిషిని పట్టి లంచమిచ్చి ఆ మనిషి ద్వారా పంపేడు. అందులో "ఫలానారోజు రాత్రి పన్నెండింటికి నేను నీకోసం మీ యింటి దొడ్డిగుమ్మం దగ్గర టేక్సీతో వుంటాను. నువ్వు వచ్చెయ్యి. మనం పారిపోయి ఏ గుళ్ళోనో పెళ్ళి చేసుకుని హాయిగా చిలకా గోరింకల్లా బ్రతుకుదాం. ఈ లోకంలో మన అమ్మా, బాబుల్లాంటి ముసలిపీనుగలు మన ప్రేమని అర్థం చేసుకోరు. పెళ్ళి చేసుకున్నాక వాళ్ళే చచ్చినట్లు పడుంటారు. వాళ్ళో మూర్ఖులు. నాలుగు రోజులు కూసి, కూసి నోరు నెప్పెట్టేక వాళ్ళే వూరుకుంటారు. మన ప్రేమ బలి కోరకూడదు. ఈ ముసలాళ్ళకి ఇలాగే బుద్ధి చెప్పాలి. ఏడ్చి మొత్తుకుని నోళ్ళు మూసుకుంటారు" అని రాశాడు.

అంతే - వాళ్ళ ప్లాను ప్రకారం రెండు పిట్టలూ తుర్రుమన్నాయి పంజరాల్లోంచి.

పూలదండలతో నూతన దంపతులు ముందుగా సరిత తల్లి తండ్రులింటికి వెళ్ళారు. తలుపు తీసిన తండ్రి కళ్ళు చింతనిప్పులయ్యాయి. కాళ్ళకి దణ్ణమెట్టబోతున్న కూతుర్నీ, అల్లుడినీ కాలికొద్దీ తన్నేడు. సుమన్‌ని మెడ పట్టుకుని గెంటేసాడు. "నా దృష్టిలో నువ్వు చచ్చావు. నా గుమ్మం దాటినరోజే నీకూ మాకూ చెల్లు, పో బైటికి" అన్నాడు తండ్రి కూతురితో. "కులం తక్కువవాడు, కూటికి సరిగ్గా లేనివాడూ నా అల్లుడంటే మాకు పరువు తక్కువ. నువ్వు కొంపకొస్తే నీ తరవాత వాళ్ళకి పెళ్ళిళ్ళవ్వాలా? తెచ్చిన తలవంపులు చాలు తల్లీ! ఇప్పటికే మా పరువు సంతలో కలిసింది వెళ్ళు వెళ్ళు" అంటూ శోకాలతో తిట్టి తిట్టి పోసింది తల్లి.

అంతే - కళ్ళ నీళ్ళు కుక్కుకుంటున్న సరితని అక్కున జేర్చుకుని "ఎవరేమన్నా ఫరవాలేదు సరితా! నేను నీకున్నన్నాళ్ళూ నీమీద ఈగని వాలనివ్వను. బాధపడకు పద" అంటూ తిన్నగా తన తల్లితండ్రుల ఇంటికి తీసుకెళ్ళాడు.

తలుపు తీసిన తండ్రి తీక్షణంగా వారిని చూసాడు. కళ్ళెత్తి చూడలేక నెమ్మదిగా వంగుని పాదాలు తాకారిద్దరు. ఏ విధమైన చలనం లేదు వారిలో. ముఖం మూడు వంకర్లు తిప్పింది తల్లి. చెల్లెళ్లు విసురుగా వెనుదిరిగి వెళ్ళిపోయారు. తప్పు చేసినవారిలా, దోషుల్లా, దొంగపని చేసి పట్టుబడ్డ వారిలా లోపలికి నడిచారు ఆ నూతన దంపతులు.

ఇక్కడే అమ్మాయిగారి అసలు కథ ప్రారంభం అయింది. సినీమాల్లోలా కాదు! నిజజీవితంలోలాగ!!

అమ్మ యింటి ఆశలేని సరితకి అత్తిల్లే శరణ్యమయింది. రెండు గదుల అద్దె కొంపలో సరితకి కోరుకున్న స్వేచ్ఛ, కొత్త దంపతులు కోరుకునే ఏకాంతం లభించటంలేదు. కలిసి కబుర్లు చెప్పుకోడానికే అవకాశం లేదా యింట్లో. దొరికినా అత్తా, ఆడబిడ్డల చూపులు మరింత భయపెట్టేవి. షికార్లు, సినీమాలూ అసలే లేవు. రాత్రి తప్ప పగలు సుమన్‌ని కలవడమే కరువయ్యేది. ప్రేమికులప్పుడు విరహంతో బాధపడేవారు. పెళ్ళయ్యాకా కలిసి కబుర్లు చెప్పుకునే అవకాశం దొరక్క కొట్టుకుంటున్నారు. ఇప్పుడు సరితకి సుమన్ పొందు కోసం తాపం ఎక్కువయింది. ఆమె వేదనా - బాధా వర్ణనాతీతం. వినే ఆత్మీయులెవరు? అర్థం చేసుకునే ఆత్మీయులెక్కడ?

ఇలాగే గడుస్తోంది కాలం. రిజల్ట్సు వచ్చాయి. డిగ్రీ పూర్తి చేసిన సుమన్ గుమాస్తాగా చేరాడు.

ఇంటికి పెద్ద కొడుకు. చదివించినదానికి కొంత రాబడితో ముగ్గురాడపిల్లల్లో ఓ పిల్ల పెళ్ళన్నా అయ్యేదని ఆశించిన ఆ దంపతులకి నిరాశే ఎదురయింది. 'ప్రేమించి పెళ్ళాడితే మాత్రం ఆడపిల్లకి ఏమీ యివ్వకుండా పంపెయ్యడమేమి'టన్న కసీ, కోపం రోజురోజుకీ అధికమవసాగింది. ధనరాసిలో పుట్టిన సరిత, కట్టుబట్టతో తమ ఇంట అడుగెట్టడం సుత్తిపోటులాగుంది. కొడుకు చేసిన దానికి వారికి చిర్రగా వుంది. కాని ఆరుగురు పిల్లలున్న ఆ కుటుంబానికి పెద్దకొడుకు చెయ్యి ఆసరా లేకపోతే గడవడం కష్టమని తెలిసి ఏమీ అనలేక నోరు మూసుకున్నారు. కడుపులో మంట చల్లార్చుకోడానికి అలుసుగా కనపడుతోంది ఎదురుగా సరిత. అత్తగారితనం, ఆడబిడ్డలతనం తలెత్తింది ఆడవాళ్ళల్లో. వాళ్ళ దెప్పులు, అవహేళనల మధ్య మామగారి వేడిచూపుల మధ్య నలిగిపోయేది సరిత.

"ఇదిగోనమ్మా మా కోడలు. ఈ రంభనే వలచి వలపలాడిపోయి మావాడు కట్టుకున్నాడు. మా వాడికి పదిహేను వేలు యిస్తామంటూ బోల్డు సంబంధాలొచ్చాయి. ఏం మందెట్టిందో తెలీదు. పైసా ఖర్చు చెయ్యకుండా కొంగుని ముడేసుకుందీ రత్నాలకుప్ప. ఇంటికి పెద్దాడా? ఆడపిల్లలకి సరదాలుండవు చెప్పండి! లక్షాధికారి పిల్లట! ముచ్చటకో రవికల బట్ట లేదు ఆడపిల్లల ముఖాలకి" అంటూ పరిచయం చేసేది యింటికొచ్చిన వారికి కోడల్ని. అపరాధిలా వారి మధ్య తలొంచుకుని, నోరు మూసుకుని నిలబడేది సరిత.

ఏ సినిమాలో చూసినా, నవలల్లో చదివినా ప్రేమించి పెళ్ళాడిన జంట చిలకా, గోరింకల్లా గాలిలో ఎగురుతూ ఆనందించడమే తప్ప ఇలాంటి మాటలపోట్లని పడడం తెలిని సరిత కిప్పుడీ జీవితం నరకంలా వుంది. "ఈ జీవితం ఎలా సాగించాలి? ముందు ముందంతా నా బ్రతుకింతేనా?" అని దిగులుపడిపోసాగింది. పుట్టింటి ఆసరాలేని ఆడది ఎన్ని యిబ్బందులకి గురవుతుందో తెలుసుకుంది. జీవితం దినదినగండమయింది. సుమన్ ప్రేమ పాఠాలు

చెప్తున్నప్పుడు, అతని తియ్యటి కబుర్లు విన్నప్పుడు నిజంగా తన జీవితం కూడా సినిమా జీవితంలాగే వుంటుందని నమ్మేసిందే తప్ప పెళ్ళయ్యాకే యిన్ని పాట్లు పడవలసి వుంటుందని ఊహించలేదు. తను చూసిన ఏ సినిమాలోనూ యింతవరకూ యిల్లా జరగలేదు. అనుభవంలోకొచ్చాకే ఎదుర్కోవడం కష్టంగానే వుంది. కార్లలో తిరిగి, వంటవాళ్ళమీద, పనివాళ్ళమీద హయాం చేస్తూ... స్వేచ్ఛగా, విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ బ్రతికిన సరిత చేతిలో యిప్పుడు పైస లేదు. రెండు మూడు నూలు చీరలు, ఓ పూట కూరుంటే రెండో పూట చారన్నం. పైగా ఎప్పుడూ చేసి ఎరగని చాకిరీ. అలిసిపోయి రాత్రి పడుకుంటే భర్త సుమన్ చిరాకు, విసుగు.

వైవాహిక జీవితపు మొదటి వార్షికోత్సవం ఏ సందడి లేకుండానే ఆ దంపతు లిద్దరి హృదయాల్లోనే దాగి గడిచిపోయింది. కలలు కలలుగానయినా నిలవకుండా కల్లలయ్యాయి. కట్టుకున్న మేడలన్నీ గాలి మేడలుగానన్నా నిలవకుండా కూలిపోయాయి. ఊహాగానాలన్నీ హుష్‌మని ఎగిరిపోయాయి. రోజూ తెల్లారి లేవడం ఇళ్లు, వాకళ్ళూ తుడవడం, కాఫీలూ, వంటా, బట్ట ఉతకడం, అంట్లు తోమడం వంటివి సరిత దినచర్య.

అలిసిపోయిన సరిత ఓర్మి, సహనం హద్దులు దాటసాగాయి.

ఈ జీవితంలో అలిసిపోయిన సరిత రాత్రి భర్త దగ్గర కూర్చుంది. నిద్రపోతున్న సుమన్ వీపుమీద చెయ్యేసింది. తన బాధ భర్తకయినా చెప్పుకుని కాస్త ఉపశమనం పొందాలన్న ఆశతో.

"అబ్బా పడుకోనీ సరితా! ఆఫీసులో చచ్చే చాకిరీ అయింది. కాస్త విశ్రాంతిగా పడుకోవాలంటే లేపేస్తావేమిటి? ఏదన్నా కావాలంటే రేపు చెప్పుగాని" అంటూ చిరాకుగా దుప్పటి లాక్కుని పడుకున్నాడు సుమన్.

నిరుత్సాహంతో నీరుగారిపోయిన సరిత నిస్పృహతో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. "నిజమే, ప్రేమించేటప్పుడున్న తహతహ యిప్పుడెందుకుంటుంది! ఆనాడు ఒక్క అంగుళం దూరంగా కూర్చోలేక వీలయినంత దగ్గరగా అంటిపెట్టుకుని మరీ కూర్చునేవాడు. మౌనంగా కూర్చుంటే మాట్లాడేవరకూ కవ్విస్తూనే వుండేవాడు. ఇంటి కెళ్ళిపోతుంటే మర్నాటి కలయిక కోసం పడే తపన, చేయించుకునే ప్రామిస్‌లు, వదల్లేక, వదల్లేక కనుచూపుమేరదాకా నిలబడి చూస్తూ చేతులూపడం, ఒక్క రోజు కలవకపోతే పరితపిస్తూ రాసే పదేసి పేజీల ఉత్తరాలు, కలుసుకోగానే తను పడ్డ విరహవేదన వర్ణించి చెప్పి, అది తగ్గించుకోడానికి పడే తాపత్రయం – ఆ ప్రేమ, ఆ తపన ఏమయ్యాయి? ఎందుకిలా మారిపోయాడు? ఆనాడు ఉద్యోగం లేకపోయినా తండ్రి తన కిచ్చే డబ్బుల్లో దాచి తనకోసం తెచ్చే కానుకలు, పువ్వులు, స్వీట్లు, తల్చుకుంటే ఆ రోజులు కలా? నిజమా! అనిపించేలాగున్నాయి. ఇప్పుడు తనదీ అని జీతం వస్తోన్నా, ఓ చిన్న కానుక, ఓ సినిమా, కనీసం తన చేతికి ఓ పది రూపాయలివ్వడం – ఏమీ లేదు. నోరు తెరుచుకుని అడిగితే "తిండికే చాలని మసకవన్నీ ఏమిటి సరితా! మనలాంటివారికి

కాదు అవన్నీ, నువ్వొక్కర్తివా చెప్పు! నీకు తెస్తే యింకా నీ వయసువాళ్ళు ముగ్గురున్నారు!" అనేవాడు. నిజమే! ఇది సినిమాకాదు సుఖాంతంతో ఆగిపోడానికి."

"మీనూ! ఆ చీరెక్కడ కొన్నావోయ్! నాకూ కొనిపెట్టవా? చాలా బాగుంది!" అంటూ డబ్బు చేతిలో పెట్టింది. "ఇలాంటిదే ఎక్కడా దొరకలేదోయ్!" అన్నప్పుడు తెగ బాధ పడిపోయి తనే బజారంతా తిరిగి, తిరిగి ఎక్కడా దొరక్క ఆఖరికి ఆ చీరమీద మమకారం చంపుకోలేక మీనూ చీర అడిగి తెచ్చుకుని ఓ వారం రోజులు కట్టుకుంది. ఆ తరవాత అలాంటిదే దొరకగానే మీనూ కొని తెచ్చి యిచ్చింది. ఓసారి కట్టింది. మళ్ళీ కట్టాలనిపించలేదు. మొదటిరోజు ఆ చీర చూసినప్పుడు పడ్డ సరదా, ఆ చీర దొరక్కపోతే పడ్డ బాధా యిప్పుడు లేదు. ఓసారి కట్టగానే మోజు తీరిపోయింది. అంతకుముందు కొన్న లెఖ్ఖలేనన్ని చీరల్లో అదీ ఒకటయి బీరువాలో కెక్కి భద్రంగా కూర్చుంది.

సరితకి ఆ సంఘటన గుర్తొచ్చి నవ్వొచ్చింది. "ఇప్పుడు సుమన్ దృష్టిలో నేనూ అంతేనన్న మాట! నన్ను పొందేవరకూ సుమన్‌లో వున్న తహతహ, ఆరాటం, విరహవేదన యిప్పుడు కనపడడంలేదు. అంటే ఏడాదిలోనే మోజు తీరిపోయిందన్నమాట. కాదు కాదు చీర కొనుక్కోగానే దానిమీద సరదా తీరిపోయినట్లే, సుమన్ సొంతం కాగానే తనమీదా సుమన్‌కి మోజు తీరిపోయింది. నిజమే! యిదివరకులా కాదుగా! ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎదురుగానే వుంటుందిగా!" అనుకుని నిట్టూర్చింది. ఎంత సర్దుకుందామన్నా మనస్సు స్వాధీనం తప్పుతోంది. దుఃఖం ఆగటం లేదు. గతాన్నంతా తల్చుకోగానే బాధ తన్నుకొచ్చింది. ఎంత ప్రయత్నించినా ఆపుకోలేకపోతోంది.

ఆమె ఏడుపులకి లేచాడు సుమన్. కారణం అడిగాడు ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ. ఆ ప్రేమకి మంచుముక్కలా కరిగి, అతని వడిలో గువ్వపిట్టయి పోయింది. కడుపులో వున్న బాధనంతా ఆ రోజు భర్తకి చెప్పుకుంది. ఇన్నాళ్ళుగా ఎవ్వరికీ చెప్పకుండా తనలో తనే కుళ్ళిపోయింది. అన్నీ చెప్పుకుని మనసుని తేలికపర్చుకోడమే కాకుండా భర్త ఓదార్పు, దీనికో పరిష్కారం లభిస్తుందని ఆశించింది. పైగా ఇన్నాళ్ళూ చెప్పనందుకు చీవాట్లేస్తాడని ఆశించింది.

"చూడు సరితా! నా జీతం ఎంతో నీకు తెల్సు. ఈ పట్నవాసంలో ఇంటద్దెకే చాలదు. పైగా నా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులు అవ్వాలి. మనం వేరే వెళ్తే వాళ్ళకీ మనకీ యిబ్బందే! అది వాళ్ళ స్వభావమని సర్దుకోడం అలవర్చుకో! గొప్పింటి పిల్లనని మర్చిపోయి మా కుటుంబ పరిస్థితులకి అలవాటు పడిపోవాలింక. కావాలంటే నువ్వు కొన్నాళ్ళు మీ వాళ్ళింటి కెళ్ళి రెస్టు తీసుకో! అంతకంటే నేనేం చెయ్యలేను. సారీ!" అంటూ పక్కకి తిరిగి పడుకున్న సుమన్‌ని పిచ్చిదానిలా చూస్తూ వుండిపోయింది.

ఆనాడు కాలిలో ముల్లు దిగినప్పుడు పంటితో పట్టుకు లాగిన మనిషేనా యితను!

కాదు కాదు - అప్పుడు సుమన్ ప్రేమికుడు. ఇప్పుడు భర్త.

అప్పుడు క్షణం క్షణం నా కోసం పరితపించే మనిషేనా?

కాదు కాదు - 'ఇప్పుడు జీవితమంతా ఎదురుగానే వుండే వ్యక్తే కదా' అని తన మంచి చెడ్డల్ని పట్టించుకోని మొగుడు.

అందేవరకూ నా పొందుకోసం పిచ్చెక్కిపోయిన సుమన్ కీనాడు తను సరిత కాదు - ఎల్లప్పుడూ యింట్లో పడుండే భార్య మాత్రమే! పైగా పుట్టింటి కెళ్ళి రెస్టు తీసుకోమనడంలో అర్థం? ప్రేమా! వెటకారమా? లేక యిక్కడుండలేకపోతే వెళ్ళిపో, నా మోజు తీరిపోయిందని చెప్పడమా?!

సినిమాలు చూసి, నవలలు చదివి ఎంత మోసపోయాను. వాటిల్లో సమాప్తాలు వేరు. నిజజీవితంలో సమాప్తాలు వేరు. అది మూడుగంటల జీవితం మాత్రమే! ఇది? ఒక జీవితకాలం!! చూసినప్పుడుండే సరదా అనుభవించినప్పుడుండదు. అందేదాకా తహతహ - అందగానే దానిమీద మోజు తీరిపోతుంది. అప్పుడు భార్యల్ని ఒక వస్తువుగా మాత్రమే చూస్తారిలాంటివాళ్ళు. ప్రేమించే రోజుల్లో అడ్డు తగిలిన రక్తసంబంధీకుల్ని దూషించి, తిట్టిపోసిన సుమన్‌కి ఈనాడు తన బాధ్యత, కర్తవ్యం గుర్తొచ్చి తిట్టిన వాళ్ళవద్దే నీతులు బోధిస్తుంటే ఏమనాలి? రక్తసంబంధీకుల మీదుండే ప్రేమ, అభిమానం భార్య పట్ల కూడా కనపర్చి ఆప్యాయంగా చూసుకుంటే!!

నిజ జీవితానికీ, సినిమా జీవితానికీ తేడా యిక్కడేనేమో? ప్రేమికుల్లారా! పెళ్లికి ముందే నా ప్రేమ కథ చదివితే ఒక్కసారి ఆగి ఆలోచించుకోండేం!!

**- కలువబాల, 16-3-1987**